# ప్రహరా హుషార్

-మల్లాది రమాంజలి

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేసరికి నా శ్రీమతి వరండాలోనే ఎదురయింది. దిగులుగా వున్న ఆమె ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసాను. అప్పటివరకు అతికష్టంమీద ఆపుకుంటోందో ఏమో ఒక్కసారిగా ముఖం చేతుల్లో కప్పుకుని బావురుమంది. ఉరుములు, మెరుపులులేని వర్షంలా ఆ హఠాత్పరిణామానికి క్షణం సేపు విస్తుపోయాను. మరుక్షణం తేరుకుని "అరె...ఏమయింది శారదా!" కంగారుగా ప్రశ్నించాను.

జవాబుగా హాల్‌లోకి కళ్లతోనే చూపించింది శారద. లోపలికి తొంగి చూసాను. అక్కడ ఓ పది వానరాలు చేరి కిష్కింధ కాండ చేసినట్లుంది. బట్టలన్నీ చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. బాత్రూమ్‌లో బక్కెట్లన్నీ ఖాళీ. హాల్‌లోనే ఓ పిల్ల కాలువ ప్రవహిస్తున్నట్లుగా ఉంది.

మా అమ్మ పడుకునే మంచం మీద పక్క బట్టలన్నీ మూట కట్టి ఉన్నాయి. అమ్మ గోడ వైపు కూర్చుని ఎవరితోనో పెద్దగా మాట్లాడుతోంది. నిన్నటివరకూ బాగానే వున్న అమ్మకి ఇంతలో ఏమయింది? దగ్గరగా వెళ్లి భుజంమీద చేయి వేసి "అమ్మా! ఎవరితో మాట్లాడుతున్నావు?" ప్రశ్నించాను.

"ఎవరేమిటిరా? మీ నాన్నగారితో, మా బాబాయ్‌తో.. ఇదిగో ఈ పిల్లలు చూడు... అబ్బబ్బ కాళ్లమీద ఒకళ్లు, పక్కలో ఒకళ్లు చంపేస్తున్నారు..."

ఏదో లోకంలో ఉన్నట్లు ఏదేదో మాట్లాడుతూనే ఉంది అమ్మ. ఆమెకు ఎనభై సంవత్సరాలు నిండుతున్నాయి. అమ్మ ఏమంటుందో క్షణంసేపు నాకర్థం కాలేదు.

"ప్రొద్దుటి నుంచీ ఇలాగే చేస్తున్నారండీ. మీకు ఫోన్ చేద్దామంటే మొబైల్ ఆఫ్ చేసుంది. నాకేదో భయంగా ఉంది" శ్రీమతి భయంగా నా చేయి పట్టుకుంది.

క్షణంసేపు ఆలోచించి "ఇప్పుడే ఆటో తీసుకువస్తాను. డాక్టర్ దగ్గరకు తీసుకువెళదాం" అంటూ చెప్పులు వేసుకుని బయలుదేరాను.

ఆటో తీసుకుని వచ్చేసరికి అమ్మను బయట కుర్చీలో కూర్చోబెట్టి తలుపు తాళంవేసి ట్యూషన్ నుంచి పిల్లలు వస్తే ఇవ్వమని తాళాలు పక్కవాళ్లకు ఇచ్చి నాతో బయల్దేరింది శారద.

***

డాక్టర్ భాస్కర్‌రావు మా అమ్మకు చేయవలసిన టెస్టులన్నీ చేసి 'బ్రెయిన్‌లో క్లాట్స్ ఉన్నాయని, టెంపరరీ మెమరీ లాస్ అనీ, ఇటువంటి పేషెంట్‌ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలనీ, మందులు రెగ్యులర్‌గా వాడాలని' చెప్పారు.

డాక్టర్ చెప్పిన మాటలకు క్షణంసేపు వెన్నులో జలదరింపు... నా ఆరో సంవత్సరంలోనే నాన్న పోతే అమ్మా నాన్నా తనే అయి పెంచింది అమ్మ.

అందరిలోకీ చిన్నవాడిని అవడంతో మరింత ప్రేమ పెంచుకుంది అమ్మ నా మీద. సుఖం అంటే ఏమిటో తెలియని అమ్మకి ఇంతలోనే పులిమీద పుట్రలా ఈ జబ్బేమిటి? నా కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

శ్రీమతి చూడకుండా కళ్లొత్తుకున్నాను. అమ్మను తీసుకుని ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది.

***

అమ్మ అనారోగ్యం గురించి ఫోన్‌లో చెప్పడంతో పెద్దన్న ముంబయి నుంచి, చిన్నన్న అహ్మదాబాద్ నుంచి మర్నాడే దిగారు. మూడో అన్న అమెరికాలో ఉండడంతో వెంటనే రాలేక ఫోన్‌లోనే అన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నాడు.

అమ్మ పరిస్థితి కళ్లారా అన్నలిద్దరూ షాకయ్యారు. స్వంత బిడ్డలనే గుర్తు పట్టలేని స్థితిలో వుంది అమ్మ. సంగతి తెలుసుకుని అక్కయ్యలు ఒక్కొక్కరే వచ్చారు.

శ్రీమతికి రోజల్లా వచ్చిపోయే అతిథులకు మర్యాద చేయడంతోనే సరిపోతోంది. డాక్టర్ ఇచ్చిన మందులు పనిచేయడానికి వారంరోజులు పట్టింది అమ్మకి.

ఈ వారంరోజులూ ఆమెను కంట్రోల్ చేయడం మాకు అసాధ్యమనిపించింది. అమ్మ పరిస్థితిని చూసి బెదిరిపోయారు అన్నలిద్దరూ. ఏమనుకున్నారో ఏమో తెలియదుగానీ సెలవు లేదంటూ ప్రయాణం కట్టారు. అమ్మను తీసుకెళ్లడం తనకిష్టమేగానీ మూడో అంతస్థులో వుంచడం కష్టమని పెద్దన్న, పనిమనుషులు దొరకడంలేదని చిన్నన్న... ఇలా తమకు తోచిన కారణాలతో ఏమనుకోవద్దంటూ మరీ మరీ చెప్పి ఎంతో నొచ్చుకుంటూ రైలెక్కారు అన్నలిద్దరూ.

***

మరో వారం రోజులు గడిచాయి.

అమ్మతో ప్రతి రాత్రీ శివరాత్రి జాగారం అవడంతో నేనూ మా ఆవిడ మానసికంగా శారీరకంగా చాలా అలసిపోయాం. అక్కయ్యలందరూ తలో కారణంతో ప్రయాణం కట్టేసారు. నాది తరచూ కేంపులకు వెళ్లే ఉద్యోగం అవడంతో ఇంట్లో అమ్మ పరిస్థితిని తలచుకుంటూ మరీ బెంబేలెత్తిపోయింది మా ఆవిడ.

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే ఆమె ప్రవర్తనలో చిటపటలూ, చికాకులూ చోటు చేసుకుని చిన్న చిన్న తగాదాలకు దారి తీస్తున్నాయి. ఆఫీస్‌లో వర్క్ టెన్షన్‌తోనూ, ఇంటి దగ్గర అమ్మ పెట్టే టెన్షన్‌తోనూ మానసికంగా విసిగిపోయాను నేను.

***

రోజులు భారంగా గడుస్తున్నాయి. రోజూ ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్లాలంటే భయంగా

ఉంది నాకు. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా ఉంది జీవితం. ఇంటి చికాకులతో చిటపటలాడే శ్రీమతికి ఓ మంత్రం వేసాను ఓరోజు.

నా కొలీగ్ శాస్త్రిగారు నా జాతకాన్నిబట్టి మా అమ్మ ఆరునెలలకంటే ఎక్కువకాలం ఉండదనీ, డాక్టర్ భాస్కరరావు కూడా అలాగే చెప్పారని చెప్పాను. అసలే జాలిగుండెగల నా శ్రీమతి అది నిజమేననుకుని నమ్మేసింది. మర్నాటి నుంచి ఇంటి వాతావరణంలో కొంతలో కొంత మార్పు చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

అర్జెంట్ మీటింగ్‌లో ఉండగా కుమారక్క నా మొబైల్‌కి కాల్ చేసింది. శారద ఏడుస్తూ ఫోన్ చేసిందనీ, అమ్మను చూడడానికి ఎవరన్నా మనిషిని చూస్తామన్నట్లుగా దాని సారాంశం.

పిచ్చెక్కినట్లుగా జుట్టు పీక్కున్నాను. ఓ అరగంట తరువాత మీటింగ్ అయిపోవడంతో కంగారుగా నా కొలీగ్ కారులో ఇంటికి బయలుదేరాను. దారంతా రకరకాల ఆలోచనలు నా పరిస్థితి నాకే అగమ్యగోచరంగా ఉంది.

ఇంటికి చేరాక శారద ముఖంలో కొంత రిలీఫ్ కనబడడంతో నేనూ కొంచెం స్థిమితపడ్డాను.

"వదినగారు ఎవరో మనిషిని పంపిస్తామన్నా





రండీ. నేనూ ఒక్కదాన్నీ ఉండలేకపోతున్నాను. మరో మనిషి సాయం ఉంటే కొంచెం ధైర్యంగా వుంటుందనీ...'' సంజాయిషీగా అన్నది శారద.

మాటలు రానట్టుగా 'ఊ...' అని ఊరుకున్నాను. మర్నాడే మళ్లీ ఫోన్ చేసింది కుమారక్క. ఓ మనిషిని పంపిస్తున్నానీ, ఆమె శాతవాహనలో వస్తున్నట్లుగా, ఆమెను రిసీవ్ చేసుకొమ్మని, ఆమె పేరు లక్ష్మమ్మ అని చెప్పింది.

మధ్యాహ్నం సెలవు పెట్టి ఆమెను రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకువచ్చాను.


***

లక్ష్మమ్మగారు వచ్చాక మేమిద్దరం కొంచెం ఊపిరి పీల్చుకున్నాం. ఆమె కలుపుగోలుతనం, ఆప్యాయత, నిండుతనం మాకు బాగా నచ్చాయి. అమ్మను చూసుకోవడంలో ఆమెకున్న ఓర్పు, నేర్పు చూసి మా ఆవిడ ముచ్చటపడి మరింత బాగా కలసిపోయింది ఆవిడతో.



## మాట తప్పని త్రిష

సినిమాకి డెబ్బై ఎనభై లక్షలు డిమాండ్ చేసే త్రిష- ఓ మలయాళ సినిమాలో నటించడానికి ఇందులో మూడో వంతునే తీసుకుంటోందిట. కారణం- తన పాత్ర బాగుండడమేనట. నటించడానికి అవకాశం వుండి, మంచి పేరు తెస్తుందనుకున్న వేషం అయితే రెమ్యునరేషన్ విషయంలో కాస్త అటూ ఇటూగా వుండేందుకు తాను ఎప్పుడూ సిద్ధమేనని ఈ మలయాళ సినిమాని ఒప్పుకుంటూ తెలుపుతోంది త్రిష. చెప్పినట్లుగా మాట మీద నిలబడ్డ త్రిషను మనం కూడా మనస్ఫూర్తిగా అభినందిద్దాం.




లక్ష్మమ్మగారి ఎంకరేజ్‌మెంట్‌తో మరుసటి నెలలోనే కంప్యూటర్ కోర్సులో చేరిపోయింది మా ఆవిడ. ఇంటి పనంతా లక్ష్మమ్మగారే చూసుకోవడంతో గోళ్లు గిల్లుకుంటున్న మా ఆవిడకు కాలక్షేపం ఉంటుందని నేనూ అడ్డు చెప్పలేదు. మా పిల్లలు కూడా బాగా చేరిక అయిపోయారు కొత్త ఆంటీతో.

ఈలోపు మందులు బాగా పని చేయడంతో అమ్మ ఆరోగ్యం కూడా కొంత కుదుట పడడం, మాకు పోయిన మనశ్శాంతి తిరిగి వచ్చినట్లుగా అయింది. స్వంత కొడుకులా భావిస్తున్న లక్ష్మమ్మగారంటే కొద్దిరోజుల్లోనే ఎంతో గౌరవం ఏర్పడింది నాకు.

ఏ ఆధారం లేని ఆమెకు భవిష్యత్తులో మంచి ఆధారం కల్పించాలనే నిర్ణయానికి వచ్చాను నేను.

చూస్తూ ఉండగానే రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. ఈలోపు రెండు మూడు కోర్సులు చేసి రెండు సర్టిఫికెట్లు కూడా సంపాదించేసింది మా ఆవిడ. పిల్లలు ఎదిగారు కాబట్టి ఏదో ఉద్యోగం తాను కూడా చేయాలనే తపన, దానికితోడు లక్ష్మమ్మగారి సపోర్టు ఒకటి. రెండున్నర సంవత్సరాలు గడిచిపోయాయి. ఈలోపు అమ్మ ఆరోగ్యం కొంతవరకు మెరుగయింది.

***

ఆ రోజు ఆఫీస్ నుంచి రాగానే "అబ్బాయ్... నీతో ఓ మాట చెప్పాలయ్యా'' అంటూ ఎదురొచ్చింది లక్ష్మమ్మ.

"ఏంటి ఆంటీ?'' అన్నాన్నేను.

"మా దూరపు బంధువుల అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. వాళ్లకి ఇద్దరు కొడుకులు పుట్టారుట. మొగుడూ, పెళ్లాం ఇద్దరూ ఉద్యోగులే. పిల్లల్ని చూసుకోవడానికి మనిషి కావాలంటూ నాకు వీసాకోసం రెండు సార్లు ప్రయత్నించారు. రాలేదు. మూడోసారి ప్రయత్నిద్దాం రమ్మంటూ ఈనెల రెండో తారీకు రమ్మన్నారు'' అంటూ ముగించారావిడ.

'భగవంతుడా! మళ్లీ సమస్య మొదలా?' ఓ నిట్టూర్పు విడిచి "సరే వెళ్లి రండి'' అన్నాను భారంగా.

ఆవిడ అదృష్టమో లేక మా దురదృష్టమో లక్ష్మమ్మగారికి వీసా వచ్చేసింది. మరుసటి నెలలోనే ప్రయాణం పెట్టుకున్నారావిడ. మేము కూడా వేరే మనిషి కోసం వేట మొదలుపెట్టాం.

ఈసారి కూడా పాపం మాకు మా అక్కే పుణ్యం కట్టుకుని మాకో మనిషిని చూసి పెట్టింది. ఈ రెండున్నర సంవత్సరాలూ లక్ష్మమ్మగారు ఎంతలా కలిసిపోయారంటే ఆవిడ వెళ్లిపోతున్నారంటే మాకు చాలా బాధగా అనిపించింది.

***

నాలుగురోజుల్లో లక్ష్మమ్మగారు వెళ్లిపోతారనగా ఓరోజు బాబీ ఏడుస్తూ నా దగ్గరకు వచ్చి "నాన్నా! నా గోలీల డబ్బా కనబడడంలేదు. అందులో నా ఫ్రెండ్ గోలీలు కూడా ఉన్నాయి నాన్నా'' వాడి ఏడుపు తారాస్థాయికి చేరుకుంది.

లక్ష్మమ్మగారు వాళ్ల చెల్లెలు ఇంటికి వెళ్లడంతో వంట పనితో బిజీగా ఉంది మా ఆవిడ.

డబ్బా వెతికి ఇవ్వకపోతే ఇల్లు పీకి పందిరేస్తాడని నేనే ఇల్లంతా వెదకడం మొదలుపెట్టాను.

ఎక్కడ వెదికినా డబ్బా మాత్రం కనబడలేదు. బాబీ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఒక్క లక్ష్మమ్మగారి లగేజ్ తప్ప ఇల్లంతా గాలించాను. ఎక్కడా

డబ్బా దొరకలేదు.

"నాన్నా! ఆంటీ బేగ్‌లో చూడు నాన్నా" వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు బాబీ.

"వద్దు బాబీ... ఇతరుల లగేజ్ చూడడం మంచి పద్ధతి కాదు. అయినా ఆంటీ నీ గోలీల డబ్బా ఎందుకు తీస్తారు?" నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. బాబీ వినకపోగా గొంతు మరింతా పెంచాడు.

"అబ్బబ్బా... వాడిని ఊరుకోబెట్టండి. ఒక్కసారి ఆ బేగ్ కూడా వెదికితే ఏమవుతుంది?" వంట గదిలో నుండి శ్రీమతి విసుర్లు.

ఏం చేస్తాం.. నా మనసుకి నచ్చకపోయినా బాబీ కోసం లక్ష్మమ్మగారి బేగ్‌ని వెతకడం మొదలుపెట్టాను. గోలీల డబ్బా కనబడకపోగా నెలవారీ సరుకులన్నీ బయటపడినాయి ఆమె బేగ్‌లోంచి. క్షణం అవన్నీ ఆవిడ పిల్లలకోసం కొనుక్కుందేమో అనుకున్నాను. కానీ సరుకులన్నీ ఇక్కడ కంటే వాళ్ల ఊళ్లోనే తక్కువ ఖరీదు అని ఓసారి చెప్పగా విన్నాను. అంటే లక్ష్మమ్మగారు.. ఇవన్నీ మా ఇంట్లో నుంచి తీసారా? క్షణంసేపు నమ్మలేకపోయాను. మాలో ఓ మనిషిగా కలసిపోయిన ఆంటీ ఇంత పని చేసారా? ఎప్పటి నుంచి జరుగుతోంది ఇది?

అంటే ఆవిడ మంచితనం అంతా ముసుగేనా? మెల్లగా శారదను పిలిచి వస్తువులన్నీ చూపించాను. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు ఆమెకు. తన మంచితనంతో మా మనసుల్లో మంచి స్థానాన్ని సంపాదించుకున్న ఆంటీ అసలు రూపం ఇదనే విషయం జీర్ణించుకోవడానికి ఇంకెంతకాలం పడుతుందో మాకు?

ఇద్దరం కూడబలుక్కున్నట్లుగా వస్తువులన్నీ ఓ సంచీలో వేసి మా గదిలో ఓ మూల సర్దేశాం.

మరో రెండు గంటలకు ఇంట్లోకి అడుగుపెట్టిన ఆంటీతో మామూలుగా ఉండడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది మా ఆవిడ. నేను కూడా ఏం జరగనట్లుగా ప్రవర్తిస్తున్నాను.

ఆ కబురూ ఈ కబురూ చెప్పి భోజనం ముగించి నడుం వాల్చారు ఆంటీ. ఇప్పుడే ఏమీ అడగవద్దన్నట్లుగా కళ్లతోనే సైగ చేసుకుని నిద్రకు ఉపక్రమించాం నేనూ శారదా.

***

మర్నాడు సాయంత్రం ఐదుగంటలు అవుతుండగా పూలమొక్కలకు నీళ్లు పెడుతున్న శారద దగ్గరకు మెల్లగా వచ్చింది ఆంటీ. ఆమె ముఖం పశ్చాత్తాపంతో నలిగిపోతున్నట్లుగా ఉంది.


"శారదమ్మా! నేను చేసింది చాలా తప్పే. ఒప్పుకుంటున్నాను. ఇంత జరిగినా నన్ను ఒక్క మాట కూడా అనకపోవడం మీ సంస్కారాన్ని తెలియజేస్తోంది. నేను ఈ దేశంలో లేకపోయినా ఒక్క నెలైనా నా పిల్లలు తృప్తిగా తింటారనే ఉద్దేశ్యంతో వస్తువులన్నీ తీసాను. నన్ను క్షమించు. నా వయస్సుకు తగ్గ పని కాదని నాకు తెలుసు. చేస్తున్నది తప్పని తెలిసినా పిల్లల కోసం కక్కుర్తిపడ్డాను" శారద చేతులు పట్టుకుని గట్టిగా ఏడ్చేసారు లక్ష్మమ్మగారు.

"ఛీ...ఛీ... ఊరుకోండి ఆంటీ. ఈ పని చేయడానికి ముందు మీరు ఒక్క క్షణం ఆలోచించి ఉండవలసింది. అయినా మీ పిల్లలు ఏమన్నా చిన్నపిల్లలా? పెళ్లిళ్లు చేసుకుని ఎవరి సంసారాలు వాళ్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే వాళ్ల బాధ్యత వాళ్లకి తెలియకుండా చేస్తే ఎలా? పిల్లలకి నిజాయితీగా బ్రతకడం నేర్పాలి. అందుకు తల్లిదండ్రులే ఆదర్శం కావాలి. మీ తప్పు మీరే తెలుసుకుంటారనే ఉద్దేశ్యంతో మేము మిమ్మల్ని అడగలేదు. మిమ్మల్ని నమ్మి ఇల్లు అప్పజెప్పి మేం చాలా తప్పు చేసాము. మీరు తగిన గుణపాఠమే నేర్పారు మాకు. మీ వస్తువులన్నీ బయటపడేసి మిమ్మల్ని రచ్చకీడ్చవచ్చు. కానీ మీ భవిష్యత్తుని పాడు చేసే ఉద్దేశ్యం మాకు లేదు. ఇన్నిరోజులుగా మీ మా అందరికీ చేసిన సేవలకు మీకు ఎప్పుడూ కృతజ్ఞులుగా ఉంటాం. కానీ లోకంలో అందరూ మాలాగే ఉండరుకదా. ఎక్కడికి వెళ్లినా అది గ్రహించి మసలుకోండి" అంత పెద్దావిడ తలొంచుకుని తనముందు నిలబడడం సహించలేనట్లుగా మరో మాటకు అవకాశం ఇవ్వకుండా లోపలకు వచ్చేసింది శారద.

కిటికీలోంచి చూస్తూ అంతా వింటున్న నాకు శారద చెప్పింది సబబే అనిపించింది. కానీ ఇలాంటి లక్ష్మమ్మలు వెళ్లినా మా అవసరానికి మరో దుర్గమ్మ రావచ్చు.

కాబట్టి వహారా హుషార్ అని గట్టిగా అనుకుని రెండురోజుల తరువాత లక్ష్మమ్మగారిని మర్యాదగా రైలెక్కించాం నేనూ, శారద.

★



## అస్థికలతో కారు మోడల్

ఇటీవల ఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరిగిన ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జంతువుల అస్థికలతో తయారుచేసిన కారు మోడల్‌ని ప్రదర్శించారు. అస్థికలతో తయారు కాబడిన ఈ వింత కారును తిలకించిన వారందరూ ఎంతగానో ఆశ్చర్యపోయారుట. ఈ ప్రదర్శనకు వచ్చిన వారిలో అత్యధిక శాతం మంది ఈ కారు గురించే మాట్లాడుకోవడం విశేషం.

-తటవర్తి

